ఊరూరా బతుకమ్మ సంబురాలు

తల్లాడ: భారతదేశ ఆకారంతో బతుకమ్మలను పేర్చిన ఉపాధ్యాయులు, పెనుబల్లి: వీఎంబంజరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేంసూరు, అక్టోబర్ 14: తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ సంబురాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలి పూలబతుకమ్మతో ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు జాతరగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ వాకిట్లో బతుకు తెరువును ఆవిష్కరిస్తుంది. తెలంగాణ సాంస్కృతిక జీవన వైవిధ్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నది. తంగేడు, గానుగు, కట్ల, గుమ్మడి, గిన్నెరు, రుద్రాక్ష, బంతి, చామంతి, బీర, కాకర వంటి ప్రకృతిపూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు తెలంగాణ అస్థిరత్వానికి ప్రతిబింబాలు. ఎంగిలిపూలు బతుకమ్మతో తెలంగాణ అంతట పండుగ ప్రారంభిస్తారు. గుమ్మడి ఆకుపై ఒక్కొక్క పువ్వును పేరుస్తూ రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పైన పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి ఆడి, పాడుతారు. అన్ని గ్రామాల్లో బతుకమ్మలు ఆడే ప్రదేశాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఒక్కో రోజు ఒక్కో విధంగా బతుకమ్మను తయారు చేసి ఆటపాటలతో అలరిస్తారు. 9వ రోజు బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

తల్లాడ: భారీ బతుకమ్మతో ఉపాధ్యాయులు

తల్లాడలో..

తల్లాడ, అక్టోబర్14: బతుకమ్మ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కోలాటం వేశారు. స్థానిక బాలభారతి విద్యాలయంలో వినూత్నంగా భారతదేశ ఆకారంలో బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడిపాడారు. అదేవిధంగా గ్రామాల్లో మొదటి రోజు ఎంగిలి బతుకమ్మ సంబురాలను మహిళలు ప్రారంభించారు. వాడవాడలా బతుకమ్మ పాటలతో, ఆటలతో సందడిగా మారాయి.

వీఎం బంజరలో..

పెనుబల్లి, అక్టోబర్14: మండలంలోని వీఎం బంజరలోని వంగా సీతారామయ్య వీధిలో ఎంగిలి పూలబతుకమ్మ పండుగ శనివారం ప్రారంభించారు. పువ్వులనే దేవతగా కొలిచే బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రత్యేక సాంస్కృతిక ఆస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన రాష్ట్ర పండుగగా గొప్పగా భావిస్తున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగిస్తారు.

నేటి నుంచి శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సరస్వతీ అమ్మవారు

సత్తుపల్లి, అక్టోబర్ 14: పట్టణ శివారులోని జేవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న శ్రీగాయత్రీ శ్రీలలితా సహిత జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 23వ తేదీవరకు శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న బాలాత్రిపురసుందరీదేవి, 16న గాయత్రీ దేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న లలితా త్రిపురసుందరి దేవి, 20న సరస్వతీ, 21న దుర్గా దేవి, 22న మహిషాసురమర్ధిని, 23న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. ఈ నవరాత్రులు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మహిళలకు కుంకుమపూజలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు సరస్వతీపూజలు నిర్వహిస్తామన్నారు. 23న విజయదశమి సందర్భంగా జమ్మిపూజ నిర్వహిస్తామని, భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

అభివృద్ధిని చూడండి.. సండ్రను ఆశీర్వదించండి

ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 14: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపును కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో శనివారం బీఆర్ఎస్ నాయకులు గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన అభివృద్ధి, అమలుచేస్తున్న పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో సండ్రకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే రఫీ, కార్యదర్శి మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్లు సూరి బాబు, అద్దంకి అనిల్, గుండ్ర రాఘవేంద్రరావు, నాయకులు అబ్దుల్లా, అమరవరపు కృష్ణారావు, మేకల నర్సింహారావు, వల్లభనేని పవన్, మదార్ పాల్గొన్నారు.

రూ.2.9లక్షల నగదు పట్టివేత

వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, సిబ్బంది

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 14: మండలంలోని మేడిశెట్టివారిపాలెం రాష్ట్ర సరిహద్దులో శనివారం ఏసీపీ రామానుజం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అశ్వారావుపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారులో ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న రూ.83వేల నగదు, ఏపీలోని విశాఖపట్నం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఇన్నోవాలో రూ.1.26 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. వీటికి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. తనిఖీల్లో సీఐ మోహన్‌బాబు, ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది సతీశ్, నరేశ్, జగదీశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాస్టర్ మధుబాబుకు సన్మానం

పాస్టర్ మధుబాబు దంపతులను సన్మానిస్తున్న సంఘస్తులు

తల్లాడ, అక్టోబర్14: మండలంలోని పినపాక గ్రామంలోని సెవెంత్‌డే అడ్వంటిస్ట్ చర్చిలో ప్రపంచ పాస్టర్ల ప్రశంస అభినందన వేడుకను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ఎస్‌డీఏ కోఆర్డినేటర్ పాస్టర్ టీ మధుబాబు ఆయన సతీమణి కల్యాణిని శాలువాలతో సత్కరించారు. మెమోంటోలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయం

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 14 : బీఆర్ఎస్ పార్టీలో చేరికలు దసరా జాతరను తలపిస్తున్నాయని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. పోచారం, పోలారం గ్రామాల పంచాయతీలోని పోచారం, అమర్‌సింగ్‌తండా, తాండ్రి మంగ్యాతండా, ఇర్పావారి గుంపు, భద్రుతండా, పూల్యాతండా గ్రామాల్లో కాంగ్రెస్, న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన 460 కుటుంబాలు వారు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ సీఎం కేసీఆర్ పాలన అందజేస్తున్నారన్నారు. సీసీ రోడ్లు, నూతన డ్రైనేజీలు, పంచాయతీ భవనాలు, వీధిలైట్లు తదితర వాటితో గ్రామాలకు నూతన కళ సంతరించుకున్నాయన్నారు. నవంబర్ 1న ఇల్లెందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద బహిరంగ సభకు సుమారు 75 వేల మంది జనసమీకరణ చేసి సభను విజయవంతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మను ఆడిపాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, నాయకులు గాజీ, లష్కర్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్లు, మేకల శ్యామ్, హరికృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లి, అక్టోబర్ 14: సత్తుపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్-2 ఫీడర్ మరమ్మతులు, ట్రీ క్లియరెన్స్ నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్-2 ఫీడర్ పరిధిలో పట్టణంలోని గాంధీనగర్, ద్వారకాపురికాలనీ, రఘురాం ఆసుపత్రిరోడ్, లలితకుమారి ఆసుపత్రి రోడ్, జూపల్లి హాస్పటల్ రోడ్, అయ్యగారిపేట, కల్పతర్ లాడ్జి రోడ్, అవని వెంచర్, రామాలయం రోడ్డులోవిద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

పెనుబల్లిలో పారిశుధ్య పనులు

పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పెనుబల్లి, అక్టోబర్14: పెనుబల్లి సర్పంచ్ తేజావత్ తావునాయక్ ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుకాలువల్లో, రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లించడం, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా పంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రామవరం, అక్టోబర్ 14: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు అన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తగూడెం త్రీ ఇంక్లైన్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు మేక పెద్దులు, చంద్రకళ దంపతుల కుమార్తె గ్లోరీ ప్రశస్త కటాస్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. తన కార్యాలయంలో గ్లోరీని ఆయన శనివారం ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. బాలబాలికలు, యువతీ యువకులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనపర్చి మంచి క్రీడాకారులుగా రాణించి పథకాలు గెలుపొందడంతో పాటు ఆరోగ్యం కాపాడుకుంటూ భవిష్యత్తులో ఎన్నో రంగాల్లో విజయాలు సాధించాలని సూచించారు.